ఓం హ్రీం శ్రీం

# శ్రీవాసవి కన్యకా దేవి పురాణము

## పంచదశాధ్యాయము

శ్రీ వాసవీదేవి విశ్వరూప దర్శనమును గూర్చియు, 102 గోత్రీయులైన ఆర్యవైశ్య దంపతులు వాసవీకన్యకతో గూడి అగ్నులలో ప్రవేశించి పరంధామమును చేరిన వైనమును గూర్చియు సాలంకాయనుడు మణిగుప్తాదులకు వివరించిన తదుపరి ఇంకను ఇట్లు చెప్పసాగెను.

ఓ మణిగుప్తాదులారా! అచ్చట విష్ణువర్ధనుడు పద్మశయనమును వీడి పరిచారకులు ముందునడువగ ఏనుగు మీద గూర్చుండినవాడై చతురంగ బలములచే సేవింపబడుచు సంతోషముతో ప్రయాణమై సూర్యోదయ కాలమునకు భగ్నమను పేరుగల పురమును చేరెను. అంతనాసమయమందు పెనుగొండ నుండి వచ్చుచున్న దూతలు చక్రవర్తికి దారిలో ఎదురువచ్చి వారి సన్నిధికి జేరి శిరములు వంచి అంజలులు గావించిరి. రాజు దూతలను జూచి "సకలము సిద్ధమైనదా యేమని" యడిగెను. సార్వభౌముని వాక్యమును వినియు నా భటులు సమాధాన వాక్యమును చెప్పుటకశక్తులైరి. అనంతరము వణకుచుండెడి ఆ దూతలను గాంచి విష్ణువర్ధనుడు భయపడవలదు. మీరలున్నదున్నట్లు సరిగజెప్పుడు" అని పలికెను. అంతట నా దూతలు రాజశ్రేష్ఠునితో "ఓ రాజా! ఆ వైశ్యులందరు వివాహ మహోత్సవమని పట్టణమును లెస్సగ నలంకరించి కన్యకతో గూడ నగ్నిని ప్రవేశించిరి." అని జరిగిన ఉదంతమంతటిని విన్నవించిరి.



శాపగ్రస్తుడైన విష్ణువర్ధన మహారాజు వాసవి అగ్నిప్రవేశ వార్తను విని, ముక్తినొందుట

## విష్ణువర్ధనుని దుర్మరణము-యువరాజు పరితాపము :-

దూతలట్లు చెప్పుచుండగనే భ్రాంతములైన ఇంద్రియములతో చక్రవర్తి "హా ఇదియేమి!" యని పలికి పరితప్త ప్రాణుడయ్యెను. అంతట ఆ సార్వభౌమని ఎదుట అష్టభుజియై అనేక శస్త్రాస్త్రములు ధరించినదియై ప్రచండ తేజముతో ప్రకాశించుచున్న అతిభయంకర కాళికామూర్తి అవతరించి నిలచినట్లైనది. క్షణములో ఆమె మధురమంజుల మనోజ్ఞమూర్తియైన వాసవీకన్యకగ మారి కనిపించినది. మరుక్షణములో ఆమెయే దుర్గయై, చండియై, మహాకాళియై అనేక రూపములు ధరించుచు వికటాట్టహాసముగావించినది. అనంత బలసంపన్నుడనని విర్రవీగినవాడును, అత్యంత నిరంకుశుడును, అసంఖ్యాత సైన్యసమేతుడును, నాకు ఎదురులేదని అహంకరించినవాడునునైన ఆ మూర్ఖ సార్వభౌముడు భోనభోంతరములు దద్దరిల్లజేయు పిడుగు ధ్వనివంటి ఆ కాళికాట్టహాసధ్వనిని విన్న మాత్రముననే శిరస్సు

వేయిముక్కలుగ పగిలి క్రింద పడెను. ఆ భయంకర దృశ్యమును చూచిన మంత్రులు, సేనాధిపతులు, సైనికులు అందరును భయకంపితులైరి. వారు పశ్చాతప్తులై భీతచిత్తులై వాసవీకన్యకా పరమేశ్వరీ భక్తులై ఆ దేవిని కీర్తింపసాగిరి.

అంత ఒక్కక్షణకాలములోపల ఆ విష్ణువర్ధనుని శరీరము నుండి నిప్పువంటి ఒక జ్యోతి బయల్వెడలి పెనుగొండలో అర్చావతారాయై వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవీ పాదసీమకు చేరి ఆమె దివ్యచరణములలో లీనమైపోయినది. ఆ జ్యోతిననుసరించి పరుగుపరుగున పెనుగొండ నగరమునకు చేరిన చక్రవర్తి యొక్క సమస్త పరిజనులును వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవీ అర్చావతారమూర్తికి పదే పదే ప్రణమిల్లిరి. ఆ జగన్మాతలీలను ముక్త కంఠములతో గానము చేసిరి. తన్మయులై వాసవీకన్యకా దేవీ నామమును భజించిరి. అంతసార్వభౌముని యమాత్యుల ఆదేశానుసారము అతివేగముగ ప్రయాణము చేయగల కొందరు భటులు యీ వార్తను పద్మశయనపురములో నున్న విష్ణువర్ధనుని కుమారుడైన రాజేంద్రునకు తెలుపుటకు తరలిపోయిరి. విష్ణువర్ధనునకు కలియుగములో అపారమైన అపకీర్తి వచ్చిపడినది. సకల దేశములలో పట్టణములలో మారుమూలలోని పల్లెపట్టులలో గూడ చాతుర్వర్ణముల వారు చక్రవర్తిని మాటిమాటికి నిందించుచు ధర్మరక్షణకై దేహత్యాగము చేసిన వైశ్యులను మిక్కిలిగ స్తోత్రము జేయసాగిరి.

పద్మశయనపురమున చక్రవర్తి భటులు తెచ్చిన ఘోరవార్తను విన్న యువరాజైన రాజేంద్రుడు ఆడుకపోతపక్షివలె దీనుడై శోకసంతప్తుడై బహుభంగుల విలపించెను. అంత రాజపురోహితుడైన ధౌమ్యుడు వాని నోదార్చి "ఓ రాజేంద్రా! ప్రాణులందరకును తమ పూర్వజన్మకర్మము వలన జనన మరణములు సంభవించును. ఇవి ప్రకృతి సిద్ధములు. సదాచారపరులు. సాధుశీలురునైన వైశ్యులను, నీ తండ్రి మలినచిత్తుడై బాధించెను. దివ్యగుణ సంపన్నురాలైన వాసవీ కన్యకను బలాత్కారముగ

వివాహమాడనపేక్షించెను. ఆ దేవి దానిని సహింపక బంధుసహితముగ జ్వలితాగ్ని యందు ప్రవేశించినది. ఆ దుష్కర్మపరిపాకము వలననే ప్రసిద్ధుడైన నీ తండ్రియు, పాపచిత్తుడైన ఆయన అనుచరులను హతులైరి. అందువలన నీవు ధైర్యము వీడి దుఖింపదగదు. నీ తండ్రియొక్క పరలోక క్రియలను జరిపించి, వైశ్యుల నూరడించి, ధర్మరాజు వలె భూమిని పాలింపుము. నీకు శుభమగును" అని బోధించెను.


అంత రాజేంద్రుడు ముని శ్రేష్ఠుడైన ధౌమ్యునితో "మహాత్మా! సార్వభౌముడైన తండ్రికి ఉత్తమగతులు కల్గించు వీరమరణముగాక ఇట్టి చావు ప్రాప్తించుటకు కారణమేమిటి? సర్వజ్ఞులైన తమరు తెలియజెప్పుడు" అని వేడెను.

ధౌమ్యుడదివిని, తన జ్ఞాన దృష్టిచే గతమందలి విషయములను గ్రహించి యువరాజుతో నిట్లు చెప్పెను. "ఓ యువరాజా! పూర్వమున మహేశుని కంటిమంటచే మన్మథుడు భస్మమయ్యెను. ఆ భస్మరాశి నుండి భండాసురుడనువాడు జన్మించెను. అతడు లోకములను పీడించుచుండగా దేవతల ప్రార్థనమేరకు ఆదిపరాశక్తి లలితామహాదేవియై ఆరక్కసుని సంహరించెను. ఆ అసురుడు తన అంత్యకాలమున దేవిని "సన్నిధి ప్రసాదింపుమని" అర్థించెను. అంతనాదేవి "ఓయీ! నీవు కలియుగమున విష్ణువర్ధనుడను పేర భువియందు జన్మించి శాపోపహతుడవై, మృతుడవైనా స్థానమును పొందగలవని పలికి అనుగ్రహించెను. ఆ భండాసురుడు తన తొలి జన్మమున చిత్రకంఠుడను గంధర్వుడుగ జన్మించి కైలాసమున కీర్తికన్యకా రూపమున అవతరించిన దేవిని వాంఛించి శాపోపహతుడై మరణించెను. ఆ గంధర్వుడే యిపుడు నీ తండ్రియగు విష్ణువర్ధన సార్వభౌముని రూపమున మానవ జన్మమునంది, ఆదిపరాశక్తి యొక్క అవతారమగు శ్రీవాసవీ కన్యకా దేవిని మోహించెను. అందుచే ఆ కన్యకాదేవీ క్రోధమునకు గురియై యిట్లు దుర్మరణమును పొందెను. కాని పరాంబికచే నిహతుడైన కారణమున నీ తండ్రిసాలోక్యముక్తినందినాడు. అందువలన నీవాతని మరణమునకై దుఖించవలదు. ఆ

వాసవీకన్యకయే ఆదిపరాశక్తియైన పరమేశ్వరి. నీవా మహాదేవిని భక్తితో అర్చించి ఆమె దర్శన భాగ్యమును పొంది ఆ జగన్మాత కృపకు పాత్రుడవు కమ్ము. మాతా పితృ వియోగముచే దుఃఖితులైయున్న వైశ్య పుత్రులను ఊరడిల్ల జేయుము." అని చెప్పెను. అంతట యువరాజైన రాజేంద్రుడు స్వస్థచిత్తుడై తండ్రికి జరుపవలసిన అపరకర్మలను నిర్వహించెను.

## పెనుగొండకు రాజేంద్రుని రాక

అనంతరము రాజేంద్రుడు వైశ్యులనూరడించుటకై పరివారములతోను, మంత్రులతోడను గూడి పెనుగొండకు విచ్చేసెను. బాలనాగరులు రాజేంద్రుని సాదరముతో ఆహ్వానించిరి. అంత రాజేంద్రుడు వైశ్యులను జూచి "ఓ వైశ్యులారా! మా తండ్రి జన్మాంతర కర్మవిశేషముల వలన మరణము పొందెను. విధికృతమును ఎవ్వరును తప్పించలేరు గదా. పితృవియోగ దుఃఖము మీకును, మాకును సమానమైనది. మీరిక యీ దుఃఖమును వీడి కుసుమశ్రేష్ఠి కుమారుడగు విరూపాక్షుని వైశ్యాధిపతిగ జేసికొని మీ పట్టణములను పాలించు కొనవలసినది. మీకును, మాకును ఆనందదాయకమైన స్నేహము వృద్ధి బొందుగాక. నా రాజ్యములోని నాల్గవ భాగమును మీకు నేనొసగదెను. మీరు సర్వతంత్ర స్వతంత్రులై సమస్త రాజ్యమును పాలించుకొనుడు. మీరు పితరుల ఋణవిముక్తి కొరకు గయలో పిండప్రదానము చేసి వచ్చునంతవరకు, నేను మీ భార్యాపుత్రుల వృద్ధుల సంరక్షణకై తగు ఏర్పాట్లు గావించెదను. నారాజధానిలో పటకుటీరములో నివసించుచు, వాసవీకన్యకాదేవిని సదా ధ్యానించుచు మీరాకకై నిరీక్షించుచుండెదను." అని పలికి బాలవైశ్యులను సన్మానించి, వారిచే సన్మానించబడి పరివారసమేతుడై తన పట్టణమునకు మరలిపోయెను.



విష్ణువర్ధనుని కుమారుడగు రాజరాజేంద్ర భూపతి కాశీకి పోవుచున్న వైశ్యకుమారులను కలిసి తన తండ్రి తప్పిదమునకు క్షమాభిక్ష నర్థించుట

అనంతరము ఆ వైశ్యులు 11 దినములు పితృకార్యక్రమములను విద్యుక్త ప్రకారము జరిపి తమ వైభవాధిక్యతననుసరించి బ్రాహ్మణోత్తములకు దానములొసగి కన్యలను ముత్తైదువులను పూజించి పితరులకు పిండప్రదానములు గావించుటకై గురువుతోడను, వేయిమంది బ్రాహ్మణుల తోడనుగూడి కాశీయాత్రకు బయలుదేరిరి. మార్గమందు భాస్కరాచార్యుని వలన అనేక పుణ్యకథలను వినుచు పరమపావనమైన ప్రయాగను చేరిరి. సూర్యుడు మకరరాశిని పొందియుండగ వారు గంగాయమునా సరస్వతుల సమ్మిశ్రిత స్వరూపమగు త్రివేణీసంగమతీర్థమందు స్నానమాచరించి బ్రాహ్మణులవలన ప్రయాగలోని నదీతీర్థ ప్రభావమును విని, వివిధ దానములతో విప్రులను సంతృప్తులను జేసి, శివరాత్రివ్రతము చేయుటకై కాశీ క్షేత్రమునకు చేరుకొనిరి. అక్కడ పంచాక్షరీ మంత్రజపము గావించుచు రాత్రి అంతయు జాగరణచేసి, అటుపై అక్కడ ఒక మాసము గడిపి గయ వెళ్ళిరి. అంతట ఆ వైశ్యులు గయలో శాస్త్రోక్త విధిని తిలోదక సహితముగ పిండముల నొసగి పితృదేవతలను సంతృప్తులను గావించిరి.

## గయలో బాలవైశ్యులకు వాసవీ సాక్షాత్కారము మరియు యంత్ర మంత్ర బింబ పూజావిధులను గూర్చిన ప్రబోధము :-

అంత ఆకాశవీధిలో నలుదిక్కులయందు ఆ బాలవైశ్యుల పితృదేవతలు ప్రత్యక్షులై వారిని ఆశీర్వదించిరి. పితృ సముదాయ మధ్యమందు తటిల్లతవలె మెరసిపోవుచు మధురమంజుల మనోహరాకృతితో శ్రీవాసవీకన్యక ప్రత్యక్షమైనది. అంత వైశ్యులు ఆ దేవిని పలువిధముల సంస్తుతించిరి. వారి భక్తికి ప్రసన్నురాలైన వాసవీకన్యక "ఓ బిడ్డలారా! మీ భక్తిని చూచి మీ పితరులతో గూడి నేనును మిక్కిలి సంతోషించితిని. మీరు అనునిత్యము నన్ను ఆరాధించుచు సమస్త సన్మంగళములను పొందుడు. ప్రతిమాసమందుగాని రెండు నెలలకొక సంవత్సరము నందుగాని, శుక్రవారము నందు గాని, నా జన్మదినోత్సవము లందుగాని, కల్పోక్తప్రకారము దీక్షా పూజా వ్రతాదులతో నన్ను ఆరాధింపుడు. నన్ను అర్చించువారికి సమస్త సంపదలను ప్రసాదించెదను. పరిశుద్ధ చరిత్ర గల్గినవియు, పితృవంశమును చక్కగ తెలుపునవియు, ప్రసిద్ధములైనవియునైన గోత్ర ప్రవరాదులను తెలిసికొని వంశాభివృద్ధికొరకై సంబంధ బాంధవ్యములను చేసికొనుడు.

మీకిపుడిక నా దివ్య మంత్ర బీజాదులను గూర్చి చెప్పుచున్నాను సావధానులై వినుడు. "ఓ భక్తవరులారా! ఓం అను ప్రణవబీజము తరువాత హ్రీం అను మాయాబీజాక్షరమును అటుపై వాగ్భవ బీజాక్షరమును ఆపై కమలాసనబీజాక్షరమును అనంతరము చంద్రబీజాక్షరమును ఆపైన అమృత బీజాక్షరమును వుంచి అటుపై **"శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి శ్రేయందేహి"** అను పదునారు అక్షరములను కూర్చి తదుపరి పూజాసమయములో "నమః"కు బదులు స్వాహా అను అక్షరద్వయమును చేర్చి మొత్తము యీ ఇరువది నాలుగు అక్షరములను కూర్చినచో అది నా మంత్రరాజమగును. ఈ శ్రేష్ఠ మంత్రమును జపించువారికి సర్వసంపదలు, సత్సంతాన భాగ్యము మరియు అంతమున

మోక్షము లభించగలవు. ఈ మంత్రములోని తొలిబీజాక్షర షట్కమునకు **"శ్రీ వాసవీ కన్యకే మహ్యాం సర్వసౌభాగ్యం దేహిదేహి స్వాహా"** అను ఇరువది అక్షరములను కలిపినచో అది సర్వోత్తమైన ఇరవై ఆరు అక్షరముల పారాయణ మంత్రము కాగలదు. ఈ మంత్రజపమువలన అనంతపుణ్యము లభించగలదు. ఈ నా మంత్రములకు సంబంధించిన అంగన్యాసకరన్యాసాది విధులను ఛందోఋషి, ప్రాణ, శక్తి కీలకాదులను భాస్కరచార్యుడు మీకు వివరముగ తెలియజేయగలడు.

ఇక నా పూజాక్రమమును చెప్పుచున్నాను వినుడు. వివాహ వ్రతయజ్ఞాదులలో జరుగు మంటపారాధనములందు నన్ను కలశ రూపమునను, దేవ్యాలయములలో విగ్రహ రూపమును పూజించవలెను. కలశమందు నేను **"క్షణిక"** యనియు, బేరములలో (విగ్రహములలో) **"నిత్య"** యనియు చెప్పబడుచున్నాను.

శ్రీచక్రసమానమై యంత్రదశాంగసముపేతమై, బిందు, త్రికోణ, అష్టకోణ, దశకోణ, సప్తదళ, అష్టదళ, చతుర్ధశారకోణ, షోడశదళ చక్రములతోను భూపురములతోను నొప్పుచు, నవావరణములతో కూడినదియు, చతుర్విద సమైక్యతలతో విలసిల్లునదియునైన నా యంత్రరాజమును స్థాపించి దానిపై లెస్సగ నా మూర్తిని దేవాలయాదులందు ప్రతిష్ఠించవలెను.

నాడు అగ్ని ప్రవేశ సమయమున నేను అర్చావవతారనై వెలసి భక్తులకు దర్శనమిచ్చిన దివ్యరూపముతో పరమమంగళకరమైన నా మూర్తిని, రూపొందించి ఆలయమునందు స్థాపించుట ఉత్తమోత్తమము. అటుగాకున్న ద్విభుజమగు నా భవ్యరూపముతో గాని, నా అవతార జీవితకాలమున నేను ప్రదర్శించియుండిన అలౌకిక రూపములలో నేదోయొక రూపముతో గాని నా విగ్రహమును తయారుచేయించి నా

ఆలయములలో ప్రతిష్ఠించనగును. అట్లు స్థాపించి పూజించిన వారికి సదాసమస్త సమృద్ధులను ప్రదానము చేయుదును.

గణేశ్వరుడు, క్షేత్రపాలికలు, ఆధారాధ్యసనశక్తులు, ద్వారశక్తులు, అష్టసిద్ధులు, ఇంద్రాది అష్టదిక్పాలకులు, సూర్యాదినవగ్రహములు, పరాశక్తినైన నాయొక్క షోడశకళాదేవతలు, అష్టదుర్గలు, సప్తమాతృకలు, ప్రసిద్ధములనైన చతుర్ధ రూపములు, వాణీ విధాతలు కోనకమలా జనార్ధనులు (లక్ష్మీనారాయణులు), గౌరీనగరేశ్వరులు నా పురమందలి నవావరణములలో పూజింపదగిన అంగోపాంగదేవతలయై యున్నారు. నన్ను శ్రీ సూక్తవిధనమున విద్యుక్తముగా పూజించవలెను.

ఓ పుత్రులారా! శేషించిన పూజా విధానమును ఋషిశ్రేష్ఠుడైన యీ భాస్కరాచార్యుడు చెప్పగలడు. నా శ్రేష్ఠమగు మంత్రమును సదాజపించుడు. అందువలన మీరు సర్వఫలములను పొందగలరు. ఓ బిడ్డలారా! భక్తియుక్తమైన మీ చిత్తశుద్ధికి సంతోషించితిని. ఒక వరమును కోరుకొనుడు" అని పలికినది. అంతట ఆ వైశ్యులు "ఓ తల్లీ! పెనుగొండ పట్టణమునందెల్లప్పుడు నీ ప్రత్యక్ష దర్శనభాగ్యము మాకు కలిగింపుము." అని కోరుకొనిరి. అంతనా వాసవీదేవి నా దర్శనము మీకు తొమ్మిది రాత్రులు కాగలదని చెప్పి దేవతాసముదాయము చేతను, సిద్ధసమూహము చేతను సేవింపబడుచు సింహవాహనము నధిరోహించనదై అంతర్ధానమైనది.

వాసవీ దేవి అంతర్ధానమైన పిదప ఆ వైశ్యశ్రేష్ఠులందరును "గయ" నుండి బయలుదేరి నైమిశారణ్య పుణ్యక్షేత్రమునకు చేరిరి. అక్కడ జగత్ప్రభుడైన గధాధరస్వామి నుపాసించుచున్న పుండలీకుడను మహర్షిని చూచి నమస్కరించి "ఓ మునిశ్రేష్ఠా! గదాధరుడైన విష్ణుదేవుని మహోత్మ్యయు గూర్చి మా పితామహులచేత కొలదిగ

చెప్పబడినది. సర్వజ్ఞుడవైన నీవు ఆ విషయమును విస్తరించి చెప్పవలసినదిగ ప్రార్థించుచున్నాము." అని వేడుకొనిరి. అంత పుండరీకుడు "ఓ వైశ్యోత్తములారా! ఆదిశక్తియు, యోగమాయా కన్యయునైన పరాంబిక ద్వాపరయుగమున నందుడను వైశ్యునియంట శ్రీకృష్ణదేవుని సహోదరియై అవతరించినది. ఆ మహాదేవియే యిప్పుడు మరల మీకులమందు వాసవీ కన్యకాదేవియై బుట్టి ధర్మమును సంరక్షించినది. మీ కుల ప్రశస్తి ఇంతటి ఘనమైనది. మీ కులగురువైన భాస్కరాచార్యుడు సర్వజ్ఞుడు సమస్తమును తెలిసినవాడు. అయినను నన్ను గొప్పజేసి గధాధర మహత్వమును తెలుపుడని కోరుచున్నాడు. మీ ఆదరాభిమానములకు ధన్యవాదములు. సావధానచిత్తులై వినుడు.

పూర్వము బ్రహ్మ మానసపుత్రుడైన సనత్కుమారుడు మార్కండేయ మహర్షికి శ్రౌతస్మార్తకర్మకాండలెవనికి చెందియున్నవో అట్టి గదాధరదేవుని మహాత్మ్యమును వినిపించెను. శ్రీ మహావిష్ణువు పితృరూపముతోను, దేవరూపముతోను, సర్వశ్రౌతస్మార్త కర్మజాలముల ఆహుతులను అనుభవించుచున్నాడు. పితృరూపముతో కవ్యమును, దేహరూపముతో హవ్యమును భుజించుచున్నాడు. ఆ దేవునకు యజ్ఞాదులందు ఇచ్చు హవ్యము కంటే శ్రాద్ధదులందిచ్చు కవ్యము (పిండప్రదానము) మిక్కిలి ప్రీతికరమైనది. దానములు, హోమములు చేయకపోయినను, పిండ ప్రదానము చేత శ్రీ హరిని, శ్రాద్ధవిధితో సంతోషపరచవలెను. చేయకూడని కార్యము చేసినయైనను సరే, పిండప్రదానాది అతిధి పూజలతో విష్ణువును సంతోషపరచువాడు, అక్షయమైన ఫలమును పొందగలడని పెద్దలు చెప్పిరి.

కావున ఏమైనను సరే, శ్రాద్ధ దినమును విడిచిపెట్టకూడదు. హరిప్రీతికరమైన శ్రాద్ధమును తప్పక చేయవలెను. తేజస్సంపన్నులైన మీరు శ్రద్ధతో శ్రాద్ధము చేయుడు. ఎవడీ రహస్య విషయమును వినునో, అతడు సర్వపాప విముక్తుడౌను." అని గదాధర

మహాత్మ్యమును పుండరీక మహర్షి వైశ్యులకు తెలియజేసెను. అంత నా వైశ్యులున ఆ ఋషికి కృతజ్ఞతాభి వందనములు గావించి అటనుండి తరలిపోయిరి.

వైశ్యులందరును మరల కాశీపట్టణమునకు పోయిరి, నియతాత్ములైన పితరులకు హితము చేయవలెనన్న కోర్కెతో తమ నగరమునందు శివలింగమును ప్రతిష్ఠించ నిర్ణయించుకొని అనేక శివలింగములను సేకరించుకొని, అన్నపూర్ణా విశ్వేశ్వరులకు ప్రణామములాచరించి, కాలభైరవుని ఆజ్ఞగొని తమ పట్టణమునకు తిరుగు ప్రయాణము సాగించిరి. పుణ్యారణ్యములను, పర్వతశ్రేష్టములను, పుణ్యదేశములను, తీర్థములను సేవించుచు పద్మశయన పట్టణమునకు వచ్చిరి. అక్కడ విష్ణువర్ధన సార్వభౌముని కుమారుడైన రాజేంద్రభూపతి రాజోద్యానములో మనోజ్ఞమైన పటకుటీరములో వాసవీదేవి అనుగ్రహమును కోరి, నియమనిష్ఠలతో ఆ దేవిని ధ్యానించుచు వసించుచుండెను. కాశీ నుండి వచ్చిన వైశ్యులందరు గంగతీర్థపు కావిళ్ళతో గూడ ఆ నగరమున ప్రవేశించిరి. ఆ కావిళ్లను మోసుకొని వచ్చినవారు "గంగకావిళ్ళవారు" అను పేరుతో ప్రసిద్ధులైరి. వారు వంశపారం పర్యముగ వైశ్యులచేత పోషింపబడునట్లు కట్టడి గావించబడెను.

చారులవలన వైశ్యుల రాకను గూర్చి విన్న రాజేంద్రుడు సంతోషాంతరంగుడై బంధుమిత్రులతోను, మంత్రిపురోహితులతోను వైశ్యుల కెదురేగి వారి క్షేమసమాచారములనడిగి, తన నెలవున కాహ్వానించి తెచ్చెను. రాజేంద్రుడు విరూపాక్షుని ఆలింగనము చేసుకొని "ఓ మహావీరా! మీరు వచ్చువరకు నేను ఒక పూట మాత్రమే నీరసాన్నమును భుజించుచు, భూశయనమును గావించుచు శ్రీ వాసవీదేవి ధ్యాన నిమగ్నుడనై యీ పటకుటీరములో వ్రతదీక్షతోనున్నాను. మీ పుణ్యదర్శనము వలన పరిశుద్ధుడనైనాను." అని స్నేహార్ద్రహృదయముతో పలికెను.

మహారాజు యొక్క మధురవచనములు విన్న విరూపాక్షాదులు ఆనంద మగ్నమానసులై ఓ రాజేంద్రా! సమస్త లోకమునకు రాజు పాలకుడును, తల్లియు, తండ్రియు నగుచున్నాడు. సర్వజనుల వర్ణాశ్రమాచారధర్మములను కాపాడుట వలన రాజు పాలకుడగుచున్నాడు. లోకమునకు జీవనోపాయములను చూపుట వలన అతడు తల్లియని చెప్పబడుచున్నాడు. అగ్నివలన, దొంగవలన, దుష్టుల వలన, శత్రువుల వలన బాధలు రాకుండ తన బిడ్డలను కాపాడినట్లు రాజు ప్రజలను కాపాడువాడు గనుక తండ్రిగా చెప్పబడుచున్నాడు. ఈ విధముగ ప్రజలను రంజింపజేయుట వలన 'రాజు' సార్ధక నాముడగుచున్నాడు. "ప్రభూ" నిన్ను జూచి మేము కృతార్థులమైనాము." అని పలికిరి. అనంతరము రాజేంద్రుని కోరికమేరకు ఆ వైశ్యులందరును పద్మశయన పురములోనే ఆ రాత్రి విశ్రాంతి తీసుకొనిరి.